క్లుప్తంగా

మెరుగైన వైద్యం అందించాలి


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న అధికారి

తాంసి: పల్లె దవాఖానాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా టీబీ నియంత్రణ అధికారి సుమలత అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పల్లె దవాఖానాను జిల్లా టీబీ నియంత్రణ అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల వ్యాప్తంగా ఉన్న టీబీ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటిస్తూ.. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. మండల వైద్యాధికారి శ్రావ్యవాణి, సూపర్‌వైజర్ తులసీరాం, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న సభ్యులు

నేరడిగొండ: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జాతీయ మానవహక్కుల సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్. తిమోతి రమణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కో ఆర్డినేటర్ అమృత్ కుమార్, ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయులు సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

దండారీ చెక్కులు అందించాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బోథ్: రానున్న దీపావళి పండుగకు ముందే దండారీ చెక్కులు అందించాలని ఆదివాసీ నాయకులు గురువారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసి విన్నవించారు. ముందుగా అందిస్తే దండారీ ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, చెక్కులు పంపిణీ చేసేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మడావి భీంరావ్, మల్లెపూల సుభాష్, భీమ బుచ్చన్న, ఆత్రం లక్ష్మణ్, మల్లెపూల స్వామి, కాశీనాథ్, భీంరావ్ పాల్గొన్నారు.

నోట్‌బుక్‌ల పంపిణీ


నోట్‌బుక్‌లు పంపిణీ చేస్తున్న నాయకులు

సిరికొండ: మండలంలోని పాలవాగు గ్రామంలో నూతనంగా ప్రారంభించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మండల ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పెన్నులు, నోట్‌బుక్‌లు గురువారం పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు పెందుర్ మహేందర్ మాట్లాడుతూ.. మండలంలోని మారుమూల గ్రామంలో చాలా ఏళ్లకు పాఠశాల ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సిడాం నాగోరావు, మెస్రం నగేశ్‌పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

జైనథ్: గ్రూప్ 2లో డిప్యూటీ తహసీల్దార్‌గా ఉద్యోగం సాధించడంతో సాత్నాల మండలంలోని సుందరగిరి గ్రామంలో విధులు నిర్వర్తిస్తున్న పంచాయతీ కార్యదర్శి జానకొండ అశోక్‌ను తోటి పంచాయతీ కార్యదర్శులు జైనథ్ ఎంపీడీవో కార్యాలయంలో గురువారం శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మహేందర్, శేఖర్, మల్లేష్, సిబ్బంది పాల్గొన్నారు.

'స్కావెంజర్ పోస్టుల్లో అక్రమాలు'

బోథ్: సొనాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్కావెంజర్ పోస్టుల్లో అక్రమాలు జరిగాయని మాజీ ఎంపీటీసీ లంక లలిత ఆరోపించారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. ఒకరితో పని చేయించి, ఇద్దరి జీతాలు తీసుకున్నారని మండిపడ్డారు. ఈ విషయమై ఇటీవల ఎంఈవో విచారణ చేపట్టారని, ప్రధానోపాధ్యాయురాలిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేదంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

వ్యర్థాలకు అర్థం..!

- చిన్నారులను ఆకట్టుకునేలా..
- పనికిరాని వస్తువులతో కళాకృతులు
- ఆలోచింపజేస్తున్న వేస్ట్ టు వండర్ పార్కు


బాటిళ్లతో తయారు చేసిన బాతు


గాంధీ పార్కులో ఏర్పాటు చేసిన వేస్ట్ టు వండర్ పార్కు

కైలాస్‌నగర్: సృజనాత్మక దృష్టి ఉండాలే కానీ.. పనికిరాని వస్తువనేదీ ఏదీ ఉండదని ఆదిలాబాద్ బల్దియా అధికారులు సృష్టించిన వెస్ట్ టు వండర్ పార్కు తెలియజేస్తోంది. పట్టణంలో రోజువారీగా జరిగే చెత్త సేకరణలో లభ్యమయ్యే వివిధ రకాల వృథా వస్తువులను ఉపయోగించి చిన్నారులను ఆకట్టుకునేలా అందమైన పార్కుకు రూపకల్పన చేశారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని ఈనెల 2న జిల్లా కలెక్టర్ రాజర్షి షా చేతుల మీదుగా ప్రారంభించిన పార్కు ప్రజలకు ఆహ్లాదం పంచడంతో పాటు అందరిని ఆలోచింపజేస్తోంది.

ట్రెయినీ కలెక్టర్ మార్గనిర్దేశంలో..

జిల్లా ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా వృత్తిపరమైన శిక్షణలో భాగంగా ఇటీవల మున్సిపల్ కార్యాలయంతో పాటు బంగారుగూడలోని బల్దియా డంపింగ్‌యార్డ్‌ను సందర్శించారు. పట్టణంలో పోగైన చెత్త చెదారాన్ని అంతటిని డంపింగ్‌యార్డులోనే నిల్వ చేస్తారు. అందులో వివిధ రకాల వృథా వస్తువులు ఉండటాన్ని గమనించిన ఆమె వాటితో పట్టణ ప్రజలను ఆకట్టుకునేలా ఏదైనా వైవిధ్యాన్ని తయారు చేయాలని బల్దియా అధికారులను ఆదేశించారు. అందుకు స్పందించిన అధికారులు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న బేటీ బచావ్.. బేటీ పడావ్ అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేలా కళాకృతిని తీర్చిదిద్దారు. దాన్ని వినాయక్‌చౌక్‌లో ఉంచారు. అలాగే చిన్నారులను ఆకరించేలా కుమురం భీంచౌక్‌లో మరో ఆకృతిని ఉంచారు. వీటికి ప్రజల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రావడంతో ప్రత్యేకంగా వృథా వస్తువులతో కళాకృతులను తీర్చిదిద్దాలని నిర్ణయించారు.

ఆకట్టుకుంటున్న వేస్ట్ వండర్ పార్కు..

డంపింగ్‌యార్డులో లభ్యమయ్యే టైర్లు, వాటర్ బాటిల్ వంటి వ్యర్థాలతో పిల్లలు ఆడుకునేందుకు అవసరమైన వివిధ రకాల ఆట వస్తువులను తయారుచేశారు. పూల మొక్కలు నాటేందుకు వీలుగా ఆకృతులను తీర్చిదిద్దారు. ఇటీవల వీటిని గాంధీ పార్కులో ప్రత్యేక విభాగంగా ఏర్పాటు చేశారు. వ్యర్థాలతో తయారు చేసిన ఈ కళాకృతులు పార్కుకు వచ్చే ప్రజలకు ఆహ్లాదం పంచుటడంతో పాటు చిన్నారులు ఆడుకునేందుకు ఉపయోగపడుతున్నాయి. వ్యర్థాలతో రూపొందించిన ఈవేస్ట్ టు వండర్ పార్కు అందరిని ఆలోచింపజేస్తోంది.

అందరిని ఆలోచింపజేస్తోంది



వృథా వస్తువులతో ఏదైనా ఉపయోగపడే ఆకృతులను రూపొందించాలనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టైర్లు, వాటర్ బాటిళ్లను ఉపయోగించి వేస్ట్ టు వండర్ పార్కును సిద్ధం చేశాం. ఇందులో చిన్నారులు ఆడుకునేందుకు అవసరమైన ఆట వస్తువులు కూడా ఉన్నాయి. దీనికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఇందులోని వస్తువులు ఆలోచింపజేసేలా ఉన్నాయి.

– చౌహాన్ అవికిరణ్, బల్దియా పర్యావరణ ఇంజనీర్

పాఠశాలకు రావొద్దు

- పెండింగ్‌లో స్కాలర్‌షిప్ నిధులు
- బెస్ట్ అవైలబుల్ స్కూల్ విద్యార్థులకు తప్పని తిప్పలు


బెస్ట్ అవైలబుల్ స్కీమ్ (BAS) స్కాలర్‌షిప్ నిధులు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని కారణంగా బెస్ట్ అవైలబుల్ విద్యార్థులకు పాఠశాల బంద్.

ప్రైవేటు పాఠశాల యజమాన్యం వాట్సాప్ గ్రూప్‌లో పెట్టిన పోస్టు

ఉట్నూర్‌రూరల్: బెస్ట్ అవైలబుల్ స్కీమ్ స్కాలర్‌షిప్ నిధులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయని కారణంగా విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. ఉట్నూర్ పట్టణ కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాల యజమాన్యం తల్లిదండ్రుల వాట్సాప్ గ్రూప్‌లో బెస్ట్ అవైలబుల్ విద్యార్థులకు పాఠశాల బంద్ అనే మెసేజ్ పెట్టారు. నిరుపేద విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలనే ఉద్దేశంతో ప్రతీ సంవత్సరం కొంత మంది విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ఎంపిక చేయడం జరుగుతుంది. గత రెండు, మూడు సంవత్సరాల నుంచి ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా నిధులు విడుదల కాకపోవడంతో ఆయా ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలు తల్లిదండ్రులపై ఫీజుల కోసం ఒత్తిడి చేస్తున్నారు. ప్రస్తుతం ఫీజు కట్టాలని స్కాలర్ షిప్ వస్తే తిరిగి చెల్లిస్తామని.. లేదంటే పిల్లలను పాఠశాలకు పంపించొద్దని చెబుతున్నారు. మూడు సంవత్సరాల నుంచి స్కాలర్‌షిప్ నిధులను ప్రభుత్వం మంజూరు చేయడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దసరా సెలవుల అనంతరం ఇక పిల్లల భారం తమ యజమాన్యంపై పడుతుందని ఫీజులు కట్టని కట్టకుంటే పాఠశాలలకు పంపిచొద్దని అనడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. తమ పిల్లల చదువులు మధ్యలోనే నిలిచిపోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.

ఇచ్చోడలో నామినేషన్లు నిల్


ఖాళీగా కూర్చున్న అధికారులు


పరిశీలిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి


విడుదల చేస్తున్న అధికారులు

ఇచ్చోడ: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను ఉదయం 10 గంటలకు అధికారులు ప్రారంభించారు. సాయంత్రం 5 గంటల వరకు ఒక్క నామినేషన్ దాఖలు కాలేదు. బీసీ రిజర్వేషన్లపై గురువారం హైకోర్టులో తుది తీర్పు నేపథ్యంలో మొదటి రోజు నామినేషన్లు వేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. పోటీ చేసే వారు నామినేషన్ పత్రాలను తీసుకెళ్లారు. రిజర్వేషన్లపై కోర్టు స్టే ఇవ్వడంతో ఎన్నికలలో పోటీ చేసేందుకు సిద్ధమైన వారికి మరోసారి ఆశాభంగం ఏర్పడింది.

నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన డీఎస్పీ

తాంసి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన జెడ్పీటీసీ, ఎంపీటీసీల నామినేషన్ కేంద్రాలను ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి పరిశీలించారు. డీఎస్పీ వెంట ఎస్సై జీవన్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

నేరడిగొండ: మండలంలోని 8 ఎంపీటీసీ, ఒక జెడ్పీటీసీ స్థానాలకు గురువారం ఎన్నికల నోటిఫికేషన్‌ను అధికారులు విడుదల చేశారు. అలాగే ఓటర్ల జాబితాను కూడా ప్రదర్శించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు


అవగాహన కల్పిస్తున్న సీఐ సునీల్‌కుమార్

ఆదిలాబాద్‌టౌన్: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ అన్నారు. పోలీసు మీకోసం కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతీ గ్రామం, ప్రతీవార్డుకు ఒక పోలీస్ అధికారిని కేటాయించినట్లు తెలిపారు. స్థానిక ప్రజలు సీసీటీవీ కెమెరాల ప్రాముఖ్యతను గుర్తించి, వీలైనంత త్వరగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మహిళలకు ఏవైనా అత్యవసర పరిస్థితులు ఎదురైతే డయల్ 100కు, షీటీంను సంప్రదించాలని పేర్కొన్నారు. అనంతరం మైనర్ డ్రైవింగ్ ప్రమాదాలు, గంజాయి వాడకంతో కలిగే అనర్థాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై గంగాధర్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం


సన్మానిస్తున్న ప్రతినిధులు

ఆదిలాబాద్: ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్స్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల ఢిల్లీలో జరిగిన సమావేశంలో నష్టాల్లో ఉన్న జిన్నింగ్ పరిశ్రమలను కేంద్ర ప్రభుత్వం లీజుకు తీసుకోవాలని కేంద్ర మంత్రులు గిరిరాజ్ సింగ్, కిషన్ రెడ్డిల దృష్టికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ తీసుకెళ్లారు. జిన్నింగ్ పరిశ్రమల సమస్యలను గురించి ప్రస్తావించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దినేష్ మాటోలియా, జిన్నింగ్ పరిశ్రమల యజమానుల సంఘం అధ్యక్షుడు రాజ్ కుమార్ చింతావార్, గణేష్ ముక్కావార్, విలాస్, మౌనిష్, హేమంత్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడి


అవగాహన కల్పిస్తున్న ఏఈవో స్వర్ణలత

నేరడిగొండ: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) స్వర్ణలత అన్నారు. గురువారం మండలంలోని వడూర్ గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఒకసారి పంట నాటిన తర్వాత నాలుగో సంవత్సరం నుంచి 30 ఏళ్ల వరకు నిరంతర ఆదాయం పొందవచ్చన్నారు. మొదటి మూడు సంవత్సరాలు అంతర పంటలు సాగు చేయవచ్చన్నారు. ప్రభుత్వం 90 శాతం మొక్కలు, డ్రిప్ నీటి వసతి కోసం 90 శాతం నుంచి వంద శాతం సబ్సిడీపై ఆయిల్‌పామ్ సాగు కోసం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రియూనిక్ ఆయిల్‌పామ్ కంపెనీ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న సాయికుమార్

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సమన్వయకర్త సాయి కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో గురువారం టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో టాస్క్‌పై అవగాహన కల్పించారు. టాస్క్‌లో ప్రవేశానికి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.360 బీసీ, ఓసీ విద్యార్థులు రూ.710 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.సంగీత, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రావణి, లెక్చరర్లు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే పల్లెల అభివృద్ధి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: బీఆర్‌ఎస్‌తోనే పల్లెల అభివృద్ధి సాధ్యమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన జిల్లా మహిళ సమైక్య మాజీ అధ్యక్షురాలు ముదుల్కర్ వనజ, మండలంలోని వాగ్దారి, మాదాపూర్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కి బుద్ధి చెప్పలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, రవీందర్ రెడ్డి, పండరి, దేవేందర్ రెడ్డి, ప్రతాప్ పాల్గొన్నారు.

భీంపూర్: మండలంలోని గొల్లఘాట్ గ్రామానికి చెందిన పలువురు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యేకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో టేకామ్ గణేష్, ఆత్రం కిరణ్, టేకామ్ వంగు, మాడవి ప్రభాస్, గవ్వల అఖిల్, ఆత్రం లాలూ, షేక్ సిరాజ్, ప్రమోద్, సరోజ్, అవినాష్, సాయి, ఉమేష్, యువరాజ్, చంద్రప్రకాశ్, ఆత్రం లాత బాయి, సంగీత, నవీన, గీత, మంగళ బాయి, రాంబాయి ఉన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలను మోసం చేశాయన్నారు. కార్యక్రమంలో నాయకులు కేమ శ్రీకాంత్, మాజీ సర్పంచ్ గంగయ్య, వినోద్,స్వామి, అశోక్ పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని మర్లపెల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సిరిసే సంజీవ్ గురువారం బీఆర్‌ఎస్‌లో చేరారు. నేరడిగొండ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మోసపూరిత రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు తిరస్కరిస్తున్నారని, అందుకే పార్టీని వీడుతున్నట్లు సంజీవ్ తెలిపాడు.

కుమురం భీం ఆశయ సాధనకు కృషి


జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

జైనథ్: మండల కేంద్రంలో బెల్లూరి ఆదివాసీలు నాయకులు కుమురం భీం వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ మాట్లాడుతూ.. ఆదివాసీ హక్కుల కోసం పోరాటం చేసిన మహనీయుడు కుమురం భీం అని కొనియాడారు. అన్ని కులాలతో పాటు ఆదివాసీ బిడ్డలకు కూడా సమాన హక్కు కల్పించాలని పోరాడారని గుర్తుచేశారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ మడావి జైతు, దుర్వ ధర్మము, మడవి సాయినాథ్, లింగు, కుర్మాబాపు, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: మండల కేంద్రంలో గురువారం తుడుం దెబ్బ, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో కుమురం భీం వర్ధంతిని నిర్వహించారు. మండలంలోని గిరిజనులు, గిరిజనేతరులు అధిక సంఖ్యలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువులు మాట్లాడుతూ.. గిరిజనుల కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం అని కొనియాడారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు


సిరికొండ: బతుకమ్మ ఆడుతున్న మహిళలు


బోథ్‌లో..

బోథ్: బోథ్ మండల కేంద్రంలో బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. గురువారం మైసమ్మ కాలనీలో బతుకమ్మ ఆడారు. తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి ఆడిపాడారు. అనంతరం పలు వీధుల గుండా బతుకమ్మలతో శోభాయాత్ర నిర్వహించి, సమీపంలోని చెరువుల్లో నిమజ్జనం చేశారు.

సిరికొండ: మండల కేంద్రంలో గురువారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రంగు రంగుల పూలను సేకరించి, అందంగా బతుకమ్మను పేర్చి బొడ్డెమ్మకు పూజలు చేశారు. బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం సమీపంలోని వాగులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

'రిజర్వేషన్లపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు'


మాట్లాడుతున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం మాట్లాడారు. సీఎం రాజకీయ లబ్ధి కోసమే రిజర్వేషన్ల పేరిట ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. బడుగు, బలహీనవర్గాలను మోసం చేస్తూ వారి భవిష్యత్‌లో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. మెనిఫెస్టోలో 42శాతం రిజర్వేషన్ల విషయాన్ని పొందుపరుస్తున్నప్పుడు ఆ నిర్ణయంతో కలిగే పరిణామాలపై ముఖ్యమంత్రికి పూర్తి అవగాహన ఉందని పేర్కొన్నారు. అయినప్పటికీ బీసీలకు హామీ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బీసీ సర్వేకు సంబంధించిన పూర్తి వివరాలను అసెంబ్లీలో ఎందుకు ప్రవేశ పెట్టలేదో చెప్పాలన్నారు. సమావేశంలో నాయకులు యాసం నర్సింగ్‌రావు, లింగారెడ్డి, గంద్రత్ రమేశ్, మార్శెట్టి గోవర్ధన్, సేవ జగదీష్, దాసరి రమేశ్, నవతె శ్రీనివాస్, రాజన్న, ధర్మపాల్, బట్టు సతీష్, లక్ష్మణ్, సంతోష్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా కలిసికట్టుగా సాగుదాం


కండువా కప్పి స్వాగతిస్తున్న కంది

కైలాస్‌నగర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా కలిసికట్టుగా ముందుకు సాగుదామని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదిలాబాద్ రూరల్ మండలం ఖారగ్రామ మాజీ ఉపసర్పంచ్‌తో పాటు, బేల, జైనథ్ మండలాలకు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో సంతోష్ రావు, గంగాధర్, సామ రూపేష్ రెడ్డి, దేవిదాస్, ఆశన్న, చంద్రషావ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఆత్రం సుశీల

బోథ్: మండలంలోని బాబెర గ్రామానికి చెందిన ఆత్రం సుశీల గురువారం కాంగ్రెస్‌లో చేరారు. నేరడిగొండ మండల కేంద్రంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ ఆమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆత్రం సుశీల మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధి దిశగా దుసుకువెళ్తుందన్నారు.